
సాక్షి గుంటూరు

ఆదివారం । 6 । జూలై । 2025



శాకంబరీగా వాసవీమాత

అచ్చంపేట: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం రాత్రి అమ్మ వారిని భక్తులు శాకంబరీగా అలంకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.70 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,146 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నృసింహుడికి సహస్ర దీపాలంకరణ

మంగళగిరి: మంగళాద్రిలో వేంచేసి వున్న లక్ష్మీనృసింహ స్వామికి శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

'డొంక' తిరుగుడు లేకుండా స్వాహా!

> అధికారం అండగా దొరికినకాడికి దోచేద్దాం అన్నట్లుంది ఎమ్మెల్యే సోదరుడి వ్యవహారం. అనుకున్నదే తడవుగా ప్రభుత్వానికి డొంక రోడ్డు కావాలంటూ ప్రతిపాదించారు. ఇంకేం.. సర్కారు పెద్దల ఆదేశాలతో ఫైలు ఆగమేఘాలపై కదిలింది. రూ.పది కోట్ల విలువైన స్థలం కాస్తా రూ.2 కోట్లకే ఫలహారం కానుంది. యాభై ఐదు ఎకరాల్లోని రైతులకు దారి లేకుండా చేసి మరీ ఆ భూమిని వెంచర్ కోసం అప్పనంగా అప్పగించేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్‌కు దారి కోసం ఎమ్మెల్యే సోదరుడి దందా

- ప్రభుత్వానికి ప్రతిపాదించిన కూటమి ఎమ్మెల్యే బంధువు
- సర్కారు పెద్దల ఆదేశాలతో ఆగమేఘాలపై కదిలిన ఫైలు
- రూ.10 కోట్ల భూమి రూ.2 కోట్లకే అప్పగింత!
- తమకు దారి లేకుండా చేస్తున్నారని రైతుల ఆందోళన
- డ్రైనేజీని సైతం పూడ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ



రియల్ ఎస్టేట్ వ్యాపారికి అప్పగించనున్న డొంక రోడ్డు ఇదే...

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'మా వెంచర్లకు రోడ్డు వేసుకుంటాం.. డొంక రోడ్డును ప్రభుత్వ రేటుకు ఇచ్చేయండని' కూటమి ఎమ్మెల్యే సోదరుడు ప్రతిపాదన పెట్టడం ఆలస్యం చిన్నబాబు అంగీకారం తెలపడంతో ఆ భూమికి రెక్కలొచ్చేశాయి. ఆగమేఘాలపై ఫైలు కదిలింది. తమ పొలాలకు దారి ఉండదని రైతులు అభ్యంతరం చెబుతున్నా రూ. 10 కోట్ల విలువైన భూమిని రూ. 2 కోట్లకే అప్పగించడానికి రంగం సిద్ధమైంది. దీనిపై అభ్యంతరాలు తెలపాలంటూ తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నోటీసులు కూడా అంటించారు.

పొలాల దారి మూసేసి..

గుంటూరు జిల్లా తాడేపల్లిలో రైల్వే ట్రాక్, ఐటీసీ వెనుక ఉన్న 99 ఎకరాల భూమిని 36 మంది రైతులు సంవత్సరాల తరబడి సాగు చేసుకుంటున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సోదరుడు ఇక్కడ గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణానికి 33 మంది రైతుల నుంచి 94 ఎకరాలను సేకరించారు. ఈ వెంచర్ కోసం రైతులు పొలాలకు వెళ్లే డొంక రోడ్డు తీసుకోవడానికి ఎమ్మెల్యే సోదరుడు సిద్ధమయ్యారు. సర్వే నంబర్ 255, 275/1ఏ, 302, 316–1లోని 2.04 ఎకరాల డొంక రోడ్డు భూమిని తమకు కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. ఎల్ ఆకారంలో ఉండే ఈ డొంక రోడ్డు ఒక భాగం పంట పొల్లాలోకి వెళ్తుంది. మరో భాగంలో తాడేపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మురుగు నీరు పోయేందుకు కాలువ ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మార్కెట్ విలువ రూ. 10 కోట్లు ఉండగా, ప్రభుత్వ రికార్డుల్లో ధర రూ.2 కోట్లకు ఎమ్మెల్యే సోదరుడు కోరడం, చినబాబు అండతో ఆ ఫైలు చకచకా కదలడం జరిగిపోయాయి.

అభ్యంతరాలు వింటేగా...

డొంక రోడ్డు స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ పేపరు ప్రకటన ఇచ్చారు. ఎంటీఎంసీ కార్యాలయం, తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం, వార్డు సచివాలయంలోని బోర్డుల్లో కూడా ఈ నోటీసులు పెట్టారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. డొంక రోడ్డు వెంచర్లకు ఇస్తే తమ పొలాలకు దారి ఉండదని చెబుతున్నారు. ముఖ్యంగా రైల్వే ట్రాక్‌కు అవల ఉన్న 55 ఎకరాలకు ఇదే దారి. వీటిని వివరిస్తూ, తమ అభ్యంతరాలతో పలువురు రైతులు జిల్లా కలెక్టర్, జేసీ, తాడేపల్లి తహసీల్దార్, ఎంటీఎంసీ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈలోగా ఎమ్మెల్యే సోదరుడు రోడ్డు పనులు వేగంగా చేసుకుపోతున్నారు. మిమ్మల్ని రైల్వే అధికారులు వెళ్లనివ్వడం లేదు కదా.. ఇక మీకు ఈ దారి ఎందుకు అంటూ ఎమ్మెల్యే సోదరుడు బెదిరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. అధికార పార్టీ వారైనందున తాడేపల్లి రెవెన్యూ అధికారులను మేనేజ్ చేశారని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.

డ్రైనేజీని కూడా కలిపేస్తారా?

తాడేపల్లి తహసీల్దార్ డొంక రోడ్డులో ఒక వైపు మాత్రమే ఉన్న రెండెకరాలను ఎమ్మెల్యే సోదరుడికి అతి తక్కువ ధరకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తుండగా, ఎమ్మెల్యే తమ్ముడు ఏకంగా 20 అడుగుల వెడల్పు డొంక, 10 అడుగుల వెడల్పు ఉన్న డ్రైనేజీని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఈ డ్రైనేజీని మూసేస్తే తాడేపల్లి పట్టణం సలాం హోటల్ సెంటర్, ముగ్గురోడ్డు, పోలకంపాడు నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు బయటకు వెళ్లదని పేర్కొంటున్నారు. ఇది తాడేపల్లికి ప్రమాదకరమని రైతులు అంటున్నారు.



పూడ్చేయనున్న డ్రైనేజీ ఇదే..

అయినా.. చినబాబు, ఎమ్మెల్యే అండదండలు, అధికారుల దన్నుతో డొంక రోడ్డును వెంచర్ రోడ్డుగా మార్చడానికి రంగం సిద్ధమైపోయింది.

నృసింహుని ఆదాయం రూ.57.59 లక్షలు



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ కానుకలను శనివారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో దేవస్థానం సిబ్బంది లెక్కించారు. ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్ రోడ్‌లో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలకు మొత్తం రూ. 57,59,764 వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువ సన్నిధి హుండీ ఆదాయం రూ. 25,52,133, దిగువ సన్నిధి హుండీ ఆదాయం రూ. 30,57,173, ఘాట్‌రోడ్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 87,409 తోపాటు అన్నదానానికి రూ. 63,049 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్ కుమార్ తెలిపారు. గతంలో కంటే రూ.11,95,012 అధికంగా వచ్చినట్లు ఆయన వివరించారు. లెక్కింపు కార్యక్రమాన్ని గుంటూరు శ్రీ జగన్నాథస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాల సహాయ కమిషనర్ డి.సుభద్ర పర్యవేక్షించారు.

ఎయిమ్స్‌లో 13 మంది విద్యార్థుల సస్పెన్షన్

మంగళగిరి: ఎయిమ్స్‌లో మెడికల్ విద్యార్థులపై చర్యలు తీసుకున్నట్లు అధికార ప్రతినిధి వంశీ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై సస్పెన్షన్ వేటు వేశామని పేర్కొన్నారు. ఏడాదిన్నరపాటు 13 మంది విద్యార్థులపై ఈ సస్పెన్షన్ విధించామని వివరించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన పలు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో నియామకాలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలువురిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వంగల వలి వీరారెడ్డి, బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన చిత్రాల ఒబేదు, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన కొమ్మినేని వెంకటేశ్వరరావు, పెదకూరపాడుకు చెందిన కొండవీటి కోటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, ఏ అంజిరెడ్డి, కొమ్మిరెడ్డి గురవారెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పెద్దిరెడ్డి సామ్రాజ్యంను అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఈపూరి రమేష్ (ఆదాం)ను పార్టీ పంచాయతీరాజ్ విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలో శనివారం జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. గౌడియా మఠం ఆధ్వర్యంలో నగర పరిధిలోని ఘాట్‌రోడ్ వద్ద నుంచి మెయిన్ రోడ్ మీదుగా మిద్దె సెంటర్, గౌతమ బుద్ధ రోడ్‌లో ఇది కొనసాగింది. కేరళ డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ హరేకృష్ణ.. హరేరామ.. రామరామ హరేహరే అంటూ భక్తులు ముందుకు సాగారు. ప్రతి కూడలిలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఎంపీడీఓలకు శిక్షణ



గుంటూరు ఎడ్యుకేషన్: క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన ఎంతో కీలకమని జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు పేర్కొన్నారు. శనివారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతి సూచిక 2.0 వెర్షన్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీఓలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్జీఎస్ఏ) వార్షిక ప్రణాళిక రూపకల్పనపై అవగాహన కల్పించారు. జిల్లా పంచాయతీ అధికారి బీవీఎస్ సాయి కుమార్, రాష్ట్రస్థాయి శిక్షకుడు డి.రవీంద్ర బాబు, డీపీఎం సీహెచ్ వెంకటేశ్వర్లు, జిల్లాస్థాయిలో వివిధ శాఖల అధికారులు పాల్గొని శిక్షణ కల్పించారు.

ఎయిమ్స్ కార్డియాలజీ విభాగంలో అత్యాధునిక సేవలు



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఎయిమ్స్ కార్డియాలజీ విభాగంలో అత్యాధునిక సేవలు అందుబాటులోకి వచ్చాయి. సెవెన్త్ జనరేషన్ బై ప్లేన్ క్యాథ్ ల్యాబ్‌ను శనివారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో అహంతెమ్ శాంత సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల ప్రజలకు గుండెకు సంబంధించి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. సుమారు రూ. 11 కోట్లు ఖరీదు చేసే అధునాతన వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. అనంతరం ఎయిమ్స్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కడియాల వికాస్, ఎయిమ్స్ అధికార ప్రతినిధి డాక్టర్ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్లకు నిలువెల్లా నేర స్వభావం

- ఆయన జీవితమంతా హత్యలు, ఫ్యాక్షన్ రాజకీయాలే
- మన్నవ గ్రామంలో ఆధిపత్యం కోసం సర్పంచ్‌ను అడ్డుతొలగించుకునేందుకు కుట్ర
- ఆయన ప్రోద్బలంతోనే సర్పంచ్ నాగమల్లేశ్వరరావుపై అమానుష దాడి
- వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆగ్రహం



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పట్నంబజారు: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర టోటల్‌గా క్రిమినల్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యా రాజకీయాలు, ఫ్యాక్షన్ దాడులు ఆయనకు పరిపాటేనని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గంలోని మన్నవ గ్రామంలో సర్పంచ్ బొనిగల నాగ మల్లేశ్వర రావును హత్య చేయించేందుకు దాడి చేయించారన్నారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడారు. ఇసుక మాఫియా దురాగతాలలో ధూళిపాళ్లకు కూడా వాటా ఉందని, దాన్ని అడ్డుకుంటున్నారనే నాగ మల్లేశ్వరరావును హత్య చేయించేందుకు కుట్ర పన్నారన్నారు. ఇనుప రాడ్లతో అత్యంత క్రూరంగా ఆ రోజు సాయంత్రం 5.05 గంటలకు దాడి జరిగితే.. పోలీసులు హుటాహుటిన 5.30 గంటలకు అక్కడ టీ స్టాల్ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీని ఎలా తీసుకుని వెళ్లారు, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పోలీసులు అక్కడికి రాగలిగారా అని ప్రశ్నించారు. హార్డ్ డిస్కులు కూడా తీసుకెళ్లారని, ఇది కచ్చితంగా ధూళిపాళ్ల ఆదేశాలతోనే జరిగిందని అర్థమవుతుందన్నారు. పాశవికంగా జరిగిన దాడి సోషల్ మీడియాలో వైరల్ అయిందని, లేకపోతే దీనిని ఒక ప్రమాదంగా చిత్రీకరించేందుకు కూడా కుట్ర పన్నారన్నారు. ఇప్పటికీ టీడీపీ నేత బాబూరావు, అతని కుటుంబసభ్యులు యథేచ్ఛగా తిరుగుతున్నా పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు.

తరాలుగా ప్రజాదరణ

1948 నుంచి మన్నవ గ్రామంలో నాగమల్లేశ్వరరావు కుటుంబానికి ప్రజలతో ఎంతో సాన్నిహిత్యం ఉందని అంబటి మురళీకృష్ణ తెలిపారు. వారి తాతల కాలం నుంచి ఎన్నో పదవులు నిర్వహిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తాను ఓటమి పాలైనా, మన్నవ గ్రామంలో 184 ఓట్లు మెజారిటీ రావడం అక్కడ నాగమల్లేశ్వరరావు కుటుంబానికి ప్రజలు ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో అర్థమవుతుందన్నారు. అందుకే భౌతికంగా నాగ మల్లేశ్వరరావును లేకుండా చేయాలనే కుట్ర చేసి, హత్య చేసేందుకు యత్నించారని అన్నారు.

పోలీసుల వైఖరిపై మండిపాటు

నాగ మల్లేశ్వరరావుపై దాడి చేస్తున్న వీడియో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించి, వైరల్ అయినప్పటికీ జిల్లా ఎస్పీ ఎందుకు స్పందించలేదని మురళీకృష్ణ ప్రశ్నించారు. జిల్లా ఎస్పీనే స్పందించకుంటే పోలీసులపై నమ్మకం పోతుందని తెలిపారు. కేసును భూస్థాపితం చేద్దామని పోలీసులు చూస్తున్నారని అన్నారు. దాడిలో పాల్గొన్న నిందితులను ఎస్సై కిరణ్ అక్కడి నుంచి తప్పించారనే సమాచారం కూడా ఉందన్నారు. దాడి జరిగిన తర్వాత కూడా పోలీసులు కనీస రక్షణ కల్పించలేదని మండిపడ్డారు. ధూళిపాళ్లపై సెక్షన్ 307 కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు తాడిబోయిన వేణుగోపాల్, రూత్‌రాణి, పెరికల కృష్ణమోహన్, గోళ్ల జ్యోతి, కోటేశ్వర రావు, దానం వినోద్, పద్మాకర్, విజయ్‌కుమార్, ఆలా శ్రీరామిరెడ్డి, ఎం. మల్లికార్జున రెడ్డి, చింతలపూడి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇవిగో.. హత్యారాజకీయాలకు సాక్ష్యాలు



వైఎస్సార్ సీపీకి బలం ఉన్న చోట దాడులు చేయిస్తున్నారని, పార్టీ నేతలు, కార్యకర్తలను భయపెడుతున్నారని మురళీకృష్ణ మండిపడ్డారు. చింతలపూడి గ్రామంలో సొసైటీ సెక్రటరీ కూచిపూడి గాంధీ ఆత్మహత్య చేసుకున్నప్పుడు తన మరణ వాంగ్మూలంలో ధూళిపాళ్ల పేరు రాయలేదా... యలవర్తి నాగేశ్వరరావును హత్య చేయించింది మీరు కాదా అని ప్రశ్నించారు. వెల్లలూరును ఫ్యాక్షన్ గ్రామంగా మార్చింది ధూళిపాళ్లేనన్నారు. అనేక మందిపై దాడులు చేయించిన చరిత్ర ఉందన్నారు. మినీ మహానాడు సాక్షిగా వైఎస్సార్ సీపీ నేతలను భూస్థాపితం చేయాలని, లేని పక్షంలో తానే రంగంలోకి దిగుతానని మండల టీడీపీ అధ్యక్షుడు బాబూరావును ఉద్దేశించి ధూళిపాళ్ల చేసిన వ్యాఖ్యలు అందరికీ తెలిసినవే అన్నారు.

కూటమి సర్కార్‌కు తీరని రక్త దాహం

- నలభై ఏళ్లుగా ప్రజా సేవ చేస్తున్న నాగ మల్లేశ్వరరావుపై దాడి దారుణం
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి
- స్థానిక ఎమ్మెల్యేను కూడా ఈ కేసులో విచారించాలని డిమాండ్



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వానికి రక్త దాహం తీరినట్టులేదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడి గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మన్నవ గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత బొనిగల నాగ మల్లేశ్వరరావును శనివారం సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గాల సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ , వనమా బాల వజ్రబాబులు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి నాగ మల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎంతమందిని పొట్టనపెట్టుకుంటారు?

పొన్నవోలు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రతి రోజు ఏదో ఒకచోట జరిగే ఈ రక్త దాహానికి అంతులేకుండా పోతోందని అన్నారు. నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను ఎంత మందిని పొట్టన పెట్టుకుంటారని మండిపడ్డారు. ఇప్పటి వరకు అనేక మందిని హతమార్చారని ఆరోపించారు. ఏ ఒక్కరి రక్తపు బొట్టు చిందినా వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని అన్నారు. వైఎస్ జగన్ ప్రతి ఒక్కరిని కన్న బిడ్డల్లా చూసుకున్నారని తెలిపారు. నలభై ఏళ్లుగా ప్రజా సేవ చేస్తున్న నాగ మల్లేశ్వరరావుపై దాడికి పాల్పడటం దారుణమని అన్నారు. సీసీ టీవీ ఫుటేజీ దృశ్యాలు వైరల్ అయి, ప్రజల్లోకి వెళ్లడంతోనే కేసు నమోదు చేశారని మండిపడ్డారు. ఈ కేసులో స్థానిక ఎమ్మెల్యేను కూడా ముద్దాయిగా చేర్చాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను కూడా నిందితుడిగా చేర్చాలి

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నాగ మల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారని అన్నారు.

స్థానిక ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే ఈ హత్యాకాండకు ప్రయత్నించారని ఆరోపించారు. ఇటీవల మినీ మహానాడులో జరిగిన వీడియో ఆధారంగా ఎమ్మెల్యేను కూడా నిందితుడిగా చేర్చాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందిస్తామని చెప్పారు.

కోటప్పకొండపై తొలి ఏకాదశికి ఏర్పాట్లు



నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ప్రత్యేక క్యూలైన్‌లలో ఉచిత, ప్రత్యేక, శీఘ్ర, అభిషేక దర్శనాలను కల్పించనున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని మూలవిరాట్ అభిషేకాలను నిలిపివేశారు. అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీరు అందుబాటులో ఉంచారు. స్వామి వారి ప్రసాదాలైన లడ్డూ, అరిసెలను సిద్ధం చేశారు. భక్తులు స్వామి వారిని ప్రశాంతంగా దర్శించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈఓ డి.చంద్రశేఖర రావు తెలిపారు. నరసరావుపేట నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను కోటప్పకొండకు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమయింది. అలాగే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

10,698 కేసులు పరిష్కారం

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 15 మంది జడ్జిలతో కక్షిదారులకు తక్షణ న్యాయం కింద 10,698 కేసులు పరిష్కారం అయ్యాయి. ఇందులో సివిల్ కేసులు 1,041, క్రిమినల్ కేసులు 9,580, ప్రీ లిటిగేషన్ కేసులు 77 ఉన్నాయి. కక్షిదారులకు వివిధ కేసుల నిమిత్తం ఇన్సూరెన్స్ కంపెనీలు, కేసుల్లో నష్టపరిహారం కింద రూ.50.96 కోట్లు చెల్లించడం జరిగింది.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,000** గరిష్ఠం : రూ. **1,700**

మోడల్ ధర రూ. **1,300**

క్లుప్తంగా

15న జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌తోపాటు వయస్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్టును ఆగస్టులో బాపట్లలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

నేడు అండర్–14 పికిల్ బాల్ పోటీలు

వివివి హెల్త్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని క్లబ్‌లో అండర్- 14 బాలబాలికల ఓపెన్ పికిల్ బాల్ పోటీలు నిర్వహిస్తామని క్లబ్ డైరెక్టర్ టి.అరుణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.


విత్తన దుకాణాల్లో తనిఖీలు

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 40 మంది అధికారులను 13 టాస్క్‌ఫోర్స్ బృందాలుగా ఏర్పాటు చేసి ఏకకాలంలో తనిఖీలు చేశారు. గుంటూరు నగరంతోపాటు జిల్లాలోని పలు విత్తన దుకాణాలు, మాన్యుఫాక్చరింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు, రిటైల్, హోల్ సేల్ దుకాణాల్లో శనివారం ఈ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగుతున్నట్లు గమనించామని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఆ విత్తనాల అమ్మకాలను నిలిపివేశామన్నారు. రూ.4.72 కోట్ల విలువైన 704.84 కిలోల మిర్చి విత్తనాలు, రూ.5.65 లక్షల విలువ గల మరో 293.85 కిలోల ఇతర విత్తనాల అమ్మకాలను నిలిపివేశామని పేర్కొన్నారు. విధిగా ధరలు, స్టాక్ పట్టికలను ఏర్పాటు చేయాలని దుకాణాదారులను ఆదేశించారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. తనిఖీల్లో జిల్లాలోని ఏడీఏలు, ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాభౌయ్.. ర్యాభౌస్..!

- కుక్కకాటుతో ర్యాబిస్ వ్యాధి
- ప్రతి ఏడాది జిల్లాలో 15కుపైగా మరణాలు
- వ్యాక్సిన్‌తో కచ్చితమైన రక్షణ
- నేడు ప్రపంచ జూనోసిస్ డే

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను 'జూనోసిస్' వ్యాధులు అంటారు. పశువులు, కుక్కలు, గుర్రాలు, పందులు, పిల్లులు, పక్షులు, ఎలుకలు తదితర పశుజాతుల నుంచి సుమారు 280 రకాల వ్యాధులు మనుషులకు సంక్రమిస్తాయి. వీటిల్లో క్షయ, మెదడువాపు, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, ర్యాబిస్ ముఖ్యమైనవి. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త 6 జూలై 1885లో పిచ్చికుక్కకాటుకు గురైన బాలుడికి ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకా వేసి రక్షించారు. నాటి నుంచి జూలై 6ను ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.



గుంటూరు మెడికల్: కుక్కకాటుతో ర్యాబీస్ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి 2011లో రాష్ట్రాన్ని వణికించింది. ప్రతి ఏడాది ర్యాబీస్‌తో జిల్లాలో పది నుంచి 15 మంది మరణిస్తున్నారు. మున్సిపాలిటీలలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవటం లేదని, కుక్కలు రోజూ గాయపరుస్తున్నాయని గుంటూరు కార్పొరేషన్‌తోపాటుగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుంచి ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. జిల్లాలో ప్రతి ఏడాది వేలల్లో కుక్కకాటు కేసులు నమోదు అవుతున్నాయి. గుంటూరు జీజీహెచ్‌లో 2023లో 34,931 మంది, 2024లో 37,202, 2025 జూన్ వరకు 13,002 కుక్కకాటు ఇంజక్షన్లు చేయించుకున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవీ...

ప్రతి కుక్కలోనూ ర్యాబీస్ వైరస్ ఉండదు. కానీ అది ఉన్న కుక్క ఏదో తెలియదు. కాబట్టి ప్రతి కుక్కకాటును సీరియస్‌గానే పరిగణించాలి. పిచ్చికుక్క కరిచిన వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ర్యాబీస్ వ్యాధి సోకిన కుక్క నాలుక బయటకు చాపి, చొంగ కారుస్తూ మతి స్థిమితం లేకుండా తిరుగుతుంది. తన యజమానిని గుర్తించలేక పోవటం, కన్పించిన ప్రతి వస్తువును కరిచేందుకు ప్రయత్నిస్తుంది. నడిచేటప్పుడు తడబడుతూ, తూలుతూ తోకను ఆడించలేని స్థితిలో ఉంటుంది. అరుపులో మార్పు వస్తుంది. నీటిని కూడా తాగలేని స్థితిలో అంటు డొక్కలు పడి ఊపిరి పీల్చుకోలేక ఐదు నుంచి ఏడు రోజుల్లో మరణిస్తుంది. మనుషులు ర్యాబీస్ వ్యాధికి గురైనప్పుడు దవడ, గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి ఎంత దాహం వేసినా నీటిని తాగలేరు. ఎక్కువ సందర్భాలలో రోగి నీటిని చూసినా ,నీటి శబ్దం విన్నా భయకంపితులవుతారు. ఈ లక్షణాన్ని హైడ్రో ఫోబియా అని పిలుస్తారు. ఇలాంటి స్థితిలో మతిస్థిమితం కోల్పోయి, ఊపిరి పీల్చుకోలేక మనుషులు కూడా మరణిస్తారు.



జీజీహెచ్‌లో వ్యాక్సిన్‌లు చేయించుకుంటున్న బాధితులు (ఫైల్)

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



కుక్క కరిచిన వెంటనే గాయాన్ని చల్లటి నీటితో, సబ్బుతో కడగాలి. గాయంపై నీరు ధారగా పడే విధంగా చేయాలి. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయాలి. గాయానికి కుట్లు వేయటం, ఆయింట్‌మెంట్ పూయటం, గాయాన్ని నిప్పుపెట్టి కాల్చటం, కోయటం వంటివి చేయకూడదు. కుక్క కరిచిన వెంటనే సాధ్యమైనంత మేరకు త్వరగా వైద్యులను సంప్రదించి టీకాలు వేయించకోవటం ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. కుక్కకరిచిన రోజు, మూడోరోజు, ఏడవరోజు, 28వ రోజు మొత్తం నాలుగుసార్లు ర్యాబీపూర్ ఇంజెక్షన్లు చేయించాలి. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి.

– డాక్టర్ నరేంద్ర వెంకటరమణ,
ఫిజీషియన్, గుంటూరు

నేడు ఉచితంగా వ్యాక్సిన్



ప్రతి సంవత్సరం పెంపుడు కుక్కలకు ర్యాబీస్ వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేస్తున్నాం. గుంటూరు కొత్తపేట పశువుల ఆసుపత్రిలో వరల్డ్ ర్యాబీస్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కొత్తపేట పశువుల ఆసుపత్రిలో 500 డోసులు వ్యాక్సిన్లు సిద్ధంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 10 వేల డోసులు పశువుల ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాం. జిల్లాలోని ప్రతి మండల పరిధిలో ఉచితంగా యాంటీ ర్యాబీస్ టీకాలు వేస్తున్నాం.

– డాక్టర్ కె.వి.వి.సత్యనారాయణ,
సంయుక్త సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, గుంటూరు

బాధితులకు ఉచితంగా వ్యాక్సిన్



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో రోజూ సుమారు 50 మంది కుక్కకాటు బాధితులు వ్యాక్సిన్ చేయించుకుంటున్నారు. అవుట్ పేషెంట్ విభాగంలో ఉదయం 9 – మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉచితంగా వ్యాక్సిన్ చేస్తున్నారు. అత్యవసర విభాగంలో అన్ని వేళలా వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుంది. కుక్కకాటును ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి వ్యాక్సిన్ వేయించుకోవాలి. పిల్లలను కుక్కలకు దూరంగా ఉంచడం ద్వారా కాపాడవచ్చు.

– డాక్టర్ యశస్వి రమణ,
సూపరింటెండెంట్, గుంటూరు జీజీహెచ్

20న వైద్య కళాశాలలో రాష్ట్ర సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన ఐఎంఏ నేతలు

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), క్లినికల్ ఇన్ఫెక్షన్స్ డిసీజెస్ సొసైటీ (సీఐడీఎస్)లు సంయుక్తంగా వైద్యులలో శాస్త్రీయ అవగాహనే లక్ష్యంగా యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై వైద్య విద్యా సదస్సు నిర్వహించనున్నాయి. ఈ పోస్టర్‌ను విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించటం అభినందనీయం అన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ మాట్లాడుతూ జూలై 20వ తేదీన గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో 'శాస్త్రీయ అవగాహనతో.. వైద్యరంగం బాధ్యతతో.. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై యుద్ధం చేద్దాం – విజయం సాధిద్దాం' పేరిట ఈ రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోగంటి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు, డీఎంఈ డాక్టర్ నరసింహం, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎం. సుభాష్ చంద్రబోస్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ తాతా సేవకుమార్, ఏపీఎంసీ సభ్యులు డాక్టర్ కేశవరావు బాబు, ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ జె.సి.నాయుడు, లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సహకారంతోనే సత్వర అభివృద్ధి

పల్నాడు జిల్లా సహకార అధికారి నాగరాజు

నరసరావుపేట ఈస్ట్: సహకారంతోనే సత్వర సామాజిక, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని, ఈ లక్ష్య సాధనకై సహకార సంఘాలు పనిచేస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో శనివారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా అధికారి నాగరాజు మాట్లాడుతూ, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో సహకార సిబ్బంది విధుల్లో మార్పులు చోటుచేసుకుంటాయనీ, అందుకు అనుగుణంగా సిబ్బంది కంప్యూటర్‌తో పాటు ఇతర నైపుణ్యాలు సాధించాలని కోరారు. డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి కె.తిరుపతయ్య సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి

యూటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ డిమాండ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో జరిగే మెగా పీటీఎంలో విట్‌నెస్ అధికారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నియమించుకుని, యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు వీడియోలు అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాభివృద్ధితోపాటు పాఠశాలలో ఉన్న వసతులపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన 17 రకాల కమిటీలు, ఫొటోలు, అప్‌లోడ్స్, విద్యాశాఖకు చెందని ఒక ప్రభుత్వ ఉద్యోగిని విట్‌నెస్ అధికారిగా ఎవరు నియమించాలని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉన్నారా, ఉన్నా సెలవు పెట్టి రాగలరా? ఉపాధ్యాయులు వారికోసం గాలించడం, ఇంత తతంగం అవసరమా? అని అన్నారు. పేరెంట్స్ మీటింగ్‌ను డాక్యుమెంట్రీ కార్యక్రమంగా మార్చడం సరికాదని, విద్యాభివృద్ధి గురించి చర్చించే కార్యక్రమంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తామని చెప్పిన పాఠశాల విద్యాశాఖ దానికి భిన్నంగా బోధనేతర కార్యక్రమాలకు వినియోగించడం సరికాదన్నారు. పాఠశాలలు ప్రారంభమైన నెల రోజుల లోపే యోగా పేరుతో వారం రోజులు, మెగా పీటీఎం పేరుతో మరో వారం రోజులు బోధన సమయం హరించుకుపోయిందని తెలిపారు. విద్యార్థుల ప్రగతి అంచనా కోసం పర్యవేక్షణాధికారులు వస్తారని చెబుతూ, బోధనేతర కార్యక్రమాలు పెంచుతూ ఉపాధ్యాయులను తిప్పుతున్నారని ఆరోపించారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

డిగ్రీలో డబుల్ మేజర్ విధానం అమలు చేయాలి

ఆక్టా – ఏపీ డిమాండ్

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం కళాశాల డిగ్రీ విద్యలో సింగిల్ మేజర్ విధానం అమలు చేయాలని నిర్ణయించటంపై ఆక్టా – ఏపీ నిరసన వ్యక్తం చేసింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉన్నత విద్య సమావేశంలో సింగిల్ మేజర్ విధానం కొనసాగించాలని నిర్ణయించటం సరికాదని ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహనరావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. సింగిల్ మేజర్ విధానం వలన విద్యార్థులకు, అధ్యాపకులకు ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలిపారు.

హైవేలో భారీగా మద్యం స్వాధీనం

ప్రత్తిపాడు: జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను ఆబ్కారీ స్పెషల్ టీంలు స్వాధీనం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం యనమదల పదహారవ నంబరు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో మురుగన్ హోటల్ వెనుక ఖాళీ ప్రదేశంలో అక్రమంగా పెద్ద ఎత్తున మద్యం నిల్వ చేసి, విక్రయాలు సాగిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సూర్యనారాయణ, ఎస్‌ఐ రెహమాన్, ఈఎస్‌టీఎఫ్ సీఐ నయనతార, ఎస్‌ఐ సత్యనారాయణ బృందాలు స్థానిక ఆబ్కారీ స్టేషను సీఐ అశోక్, ఎస్‌ఐ రవీంద్రబాబులతో కలిసి శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించాయి. దాడుల్లో వివిధ బ్రాండ్లుకు చెందిన 2,598 మద్యం సీసాలు, 246 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిని సీజ్ చేసి ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషనుకు తరలించారు. ఈ మేరకు ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెంకు చెందిన వాసిమళ్ల ప్రసాదరావుపై శనివారం కేసు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ అశోక్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ. 7 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో అధికారులు

గుంటూరు పోస్టల్ ఉద్యోగులకు పురస్కారాలు

లక్ష్మీపురం: గుంటూరు డివిజన్ పోస్టల్ ఉద్యోగులకు ప్రాంతీయ పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా పురస్కారాలను అందజేశారు. విజయవాడలో శుక్రవారం జరిగిన నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు డివిజన్‌కు చెందిన పోస్టాఫీసుల సూపరింటెండెంట్ యు. యలమందయ్యకు 'సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్', సిటిజన్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పఠాన్ కరిముల్లా ఖాన్‌కు 'సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్'ను అందించారు. విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర పాటిల్, విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివ హర్షల చేతుల మీదుగా ఈ పురస్కారాలను వారు అందుకున్నారు. ఉద్యోగుల అంకిత భావం, ప్రజా సేవ పట్ల నిబద్ధతకు ఇది నిదర్శనం అని యు.యలమందయ్య చెప్పారు.



యు.యలమందయ్య, సీఎస్‌ఈ పఠాన్ కరిముల్లాలకు పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి నాటికల పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనలో రాజకుమారి, ఇతర అతిథులు



'సారీ... రాంగ్ నెంబర్'లో ఓ సన్నివేశం

తెనాలి: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ –తెనాలి వారి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి జ్యోతిప్రజ్వలన చేశారు. ప్రారంభ సభకు ప్రముఖ సినీ మాటల రచయిత, కళల కాణాచి, తెనాలి అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అధ్యక్షత వహించారు. డీఎల్ కాంతారావు పోస్టల్ ఎంప్లాయిస్ కళాపరిషత్ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, రంగస్థల, సినీనటుడు వేమూరి విజయభాస్కర్, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తొలిగా హేలాపురి కల్చరల్ అసోసియేషన్, ఏలూరు వారి 'సారీ...రాంగ్ నెంబర్' నాటికను ప్రదర్శించారు. చింతల మల్లేశ్వరరావు రచనను మహ్మద్ ఖాజావలి దర్శకత్వంలో ప్రదర్శించారు. అనంతరం కళాంజలి, హైదరాబాద్ వారి 'వీడేం మగాడండీ బాబు' హాస్యనాటికను ప్రదర్శించారు. పీటీ మాధవ్ రచనకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. నిర్వాహకులు ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.

మారుమోగిన హరేకృష్ణ నామస్మరణ

నగరంపాలెం: గుంటూరు నగర వీధుల్లో హరేకృష్ణ నామస్మరణ మారుమోగింది. హరేకృష్ణ గోకుల క్షేత్రం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చంద్రమౌళినగర్‌లోని మాజేటి రామ కల్యాణ మండపం వద్ద శ్రీజగన్నాథ రథయాత్ర ఉత్సవం వైభవంగా ప్రారంభమైంది. కొరిటెపాడు, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ మీదగా మరలా రామ కల్యాణ మండపం వద్దకు చేరుకుంది. భక్తులు స్వామి వారి రథాన్ని లాగుతూ ముందుకు కదిలారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కృష్ణ జన్మాష్టమి వరకు సహస్ర కోటి హరినామ జప యజ్ఞం నిర్వహించనున్నట్లు హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షులు వంశీధర్ దాస తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఎస్ఎల్‌వీ రాజు, క్రేన్ వక్కపొడి సంస్థల డైరెక్టర్ గ్రంధి కాంతారావు పాల్గొన్నారు.



రథంపై ఊరేగుతున్న స్వామివారు



పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, మాజీ ఎంపీ గోకరాజు, గ్రంధి కాంతారావు